క్లుప్తంగా

శాసనమండలి విప్‌ను కలిసిన డీసీఎంఎస్ చైర్మన్



పాలవలస విక్రాంత్‌ను సన్మానిస్తున్న గొండు కృష్ణమూర్తి

గార: ఏపీ శాసన మండలి విప్‌గా నియమితులైన పాలవలస విక్రాంత్‌ను డీసీఎంఎస్ చైర్మన్ గొండు కృష్ణమూర్తి శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. శుభాకాంక్షలు తెలిపి దుశ్శాలువతో సన్మానించారు.

సీనియర్ న్యాయవాది కృష్ణచంద్‌కు సత్కారం



వాన కృష్ణచంద్‌ను సన్మానించిన దృశ్యం

శ్రీకాకుళం అర్బన్: బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు, ప్రభుత్వ న్యాయవాది, సామాజిక సేవకుడు వాన కృష్ణచంద్‌కు వాకర్స్ కేబినేట్ సమావేశంలో వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థల చైర్మన్ డాక్టర్ ఎస్.వి.రవీంద్ర శుక్రవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయవిజ్ఞానాన్ని సామాన్యులకు చేరువ చేయటంలో కృష్ణచంద్ అగ్రస్థానంలో నిలుస్తున్నారని కొనియాడారు. తన తండ్రి స్థాపించిన న్యాయ కళాశాలలో న్యాయవిద్యను అభ్యసించిన విద్యార్థిని సత్కరించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ గవర్నర్ కె.సత్యం, వాకర్స్ ప్రతినిధులు జి.ఇందిరాప్రసాద్, ఎస్.జోగినాయుడు, పీజీ గుప్తా, కూన వెంకటరమణ మూర్తి, సురేష్ పండా, బి.దేవీప్రసాద్, గౌరీశంఖర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సత్ప్రవర్తనతో మెలగాలి



మాట్లాడుతున్న కళావెంకటరావు

లావేరు: విద్యార్థులు సత్ప్రవర్తనతో మెలగాలని మై డ్రీమ్ ఆకాడమీ చైర్మన్ నాజాన కళా వెంకటరావు అన్నారు. గాంధీ జయంతి మాసోత్సవాల్లో భాగంగా మై డ్రీమ్ ఆకాడమీ ఆధ్వర్యంలో మురపాక పీబీ నగర్ కాలనీలోని కేజీబీవీలో బాలబాలికల అభ్యున్నతి కోసం ప్రేరణ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. విద్యార్థులు సన్మార్గంలో నడవాలన్నారు. భవిష్యత్తు నిర్దేశమార్గాలను సూచిస్తూ విద్యార్థుల్లో ఆత్మస్థైర్యాన్ని పెంపొందించే అంశాలు తెలియజేశారు. ఉత్తరాంధ్ర వ్యాప్తంగా బాలికల ఉన్నతి కోసం మైడ్రీమ్ ఆకాడమీ ద్వారా మహాసంకల్పం కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రిన్సిపాల్ బి.సుధ, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

కరాటే పోటీల విజేతలకు అభినందనలు



పవన్‌సాయిని అభినందిస్తున్న కళాశాల సిబ్బంది

రణస్థలం: కేరళలోని తివేంద్రంలో ఈ నెల 1, 2 తేదీల్లో జరిగిన సౌత్‌జోన్ పెన్‌కాక్ సిలాట్ కరాటే పోటీల్లో రణస్థలం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థి మామిడి పవన్‌సాయి బంగారు పతకం సాధించాడు. దీంతో కళాశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జి. సింహాచలం, ఆధ్యాపక సిబ్బంది పవన్‌సాయిని అభినందించారు. అలాగే రణస్థలం టైగర్ ఆకాడమీ కరాటే విద్యార్థులు కూడా వివిధ పతకాలు సాధించగా.. ఎస్సై జి.రాజేష్, పోలీస్ సిబ్బంది అభినందించారు.

రహదారి ఆక్రమణపై ఫిర్యాదు



తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన మహిళలు

రణస్థలం: మండల కేంద్రంలోని వెంకటేశ్వర కాలనీలో రహదారి ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడం వలన వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురౌతున్నాయని ఆ కాలనీ మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే విషయమై తహసీల్దార్ సనపల కిరణ్‌కుమార్‌కు శుక్రవారం ఫిర్యాదు చేశారు. పలువురు రహదారిని ఆక్రమించి ఇళ్ల నిర్మాణం చేపట్టడంతో జగనన్న చెబుదాం కార్యక్రమంలో జేసీ ఎం. నవీన్‌కు ఫిర్యాదు చేశామన్నారు. వెంటనే స్పందించి కాలువ నిర్మాణ పనులు చేపట్టారన్నారు. అయితే ఆక్రమణలు తొలగించే ప్రక్రియలో పలువురు తమను దుర్భాషలాడుతూ, కాలువ నిర్మాణ పనులకు అకంటం కలిగిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు.



ఎచ్చెర్ల క్యాంపస్: బొంతలకోడూరులో విద్యార్థినికి కళ్లద్దాలు పెడుతున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్



గార: బూరవెల్లిలో పౌష్టికాహార కిట్లు అందజేస్తున్న దృశ్యం

ఆరోగ్య సురక్షతో భరోసా



శ్రీకాకుళం రూరల్: వైద్య శిబిరంలో పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం రూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలతో పేదల ఆరోగ్యానికి భరోసా కలుగుతుందని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. శ్రీకాకుళం రూరల్ మండల పరిధిలోని పెదపాడు-1 సచివాలయం వద్ద శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని మంత్రి పరిశీలించారు. స్థానికంగా అందుతున్న సేవలపై ఆరా తీశారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇప్పటికే నగరంలోని అర్బన్ హెల్త్ సెంటర్లు, గ్రామాల్లో విలేజ్ క్లినిక్‌ల ద్వారా వైద్యసేవలు అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ చల్లా ఓబులేషు, డీసీఎంఎస్ చైర్మన్ గొండు కృష్ణ మూర్తి, గార ఐసీడీఎస్ సీడీపీఓ రాధామాధవి, పార్టీ నాయకులు చిట్టి రవికుమార్, గుర్రు రవియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం రూరల్: సింగుపురంలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. 414 మంది ఓపీ నమోదు చేసుకున్నారు. 78 మందికి స్కానింగ్‌లు, 41 మంది కంటి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ యువనేత ధర్మాన రామ్ మనోహర్‌నాయుడు, తహశీల్దార్ ఎస్.వెంకట్రావు, ఈఓపీఆర్‌డీ ఎ.రమేష్, జిల్లా పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షుడు అంబటి శ్రీనివాసరావు, ఎంపీపీ అంబటి నిర్మల, జెడ్పీటీసీ రుప్ప దివ్య, సర్పంచ్ గుండ ఆదిత్యానాయుడు, పార్టీ నాయకులు గుండ మోహన్, బగ్గు అప్పారావు, నక్క శంకర్, యజ్జల గురుమూర్తి, ముద్దాడ రామ్మోహన్ పాల్గొన్నారు.



లావేరు: కొత్తకుంకాంలో తనిఖీలు చేస్తున్న వైద్యులు

గార: బూరవెల్లి గ్రామంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ యువనేత ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు, ఎంపీపీ గొండు రఘురామ్, డీసీఎంఎస్ చైర్మన్ గొండు కృష్ణమూర్తి, అరవల రామకృష్ణ, ముంజేటి కృష్ణమూర్తి, మార్పు పృథ్వీరాజ్, మళ్ల నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాఆరోగ్యమే లక్ష్యం: ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

ఎచ్చెర్ల క్యాంపస్: ప్రజాఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యమని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. బొంతలకోడూరు గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని శుక్రవారం పరిశీలించారు. అనంతరం వైద్యులతో గ్రామంలో రోగుల పరిస్థితి, అందుతున్న వైద్య సేవలు, ఆరోగ్యశ్రీ సేవలపై చర్చించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా ఆరోగ్యం లక్ష్యంగా జగనన్న ఆరోగ్య సురక్ష ప్రారంభించాలరన్నారు. ఎంపీపీ మొదలవలస చిరంజీవి, మండల పార్టీ అధ్యక్షుడు ముద్దాడ శంకర్, జేసీఎస్ ఇన్‌చార్జి మూగి శ్రీరాములు, స్థానిక సర్పంచ్ పంచిరెడ్డి రాంబాబు, ఎంపీటీసీ సభ్యుడు మాడుగుల జగదీష్ పాల్గొన్నారు.

కొత్తకుంకాంలో..

లావేరు: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో కె.సురేష్ కుమార్ అన్నారు. కొత్తకుంకాం గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. లావేరు, మురపాక పీహెచ్‌సీల వైద్యులు మౌనిక, జగదీష్‌కుమార్, రిమ్స్ ఆస్పత్రి వైద్యులు 224 మందికి వైద్యపరీక్షలు చేసి మందులు అందించారు. మండల పంచాయతీ అధికారి వి.విశ్వేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి కంది నాని, కొత్తకుంకాం ఎంపీటీసీ సభ్యుడు దొండపాటి శివ, మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు రొక్కం బాలక్రిష్ణ, జెడ్పీటీసీ సభ్యుడు మీసాల సీతన్నాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు దన్నాన రాజినాయుడు, జేసీఎస్ మండల ఇన్‌చార్జి మీసాల శ్రీనివాసరావు, సర్పంచ్ శటికం వెంకటరమణ, హెల్త్ అసిస్టెంట్ ఆర్.శ్యామ్‌సుందర్ పాల్గొన్నారు.

పైడిభీమవరంలో..

రణస్థలం: పైడిభీమవరం-1 గ్రామ సచివాలయంలో పాతర్లపల్లి వైద్యులు క్రిష్ణ చైతన్య ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరిగింది. శిబిరాన్ని ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ సందర్శించారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. 307 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి సాయికుమార్, జెడ్పీటీసీ సభ్యుడు టొంపల సీతారాం, పార్టీ మండలాధ్యక్షుడు మహంతి పెదరామినాయుడు, నాయకులు లంకలపల్లి ప్రసాద్, ఆకుల శ్రీనివాసరావు, చిల్ల వెంకటరెడ్డి ఉన్నారు.



శ్రీకాకుళం రూరల్: సింగుపురంలో కళ్లద్దాలు పంపిణీ చేస్తున్న ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు



రణస్థలం: పైడిభీమవరంలో వైద్య సేవలు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

సక్రమంగా ఈక్రాప్ నమోదు

• జాయింట్ కలెక్టర్ నవీన్

లావేరు: ఈక్రాప్ నమోదు ప్రక్రియను సక్రమంగా చేపట్టాలని జాయింట్ కలెక్టర్ నవీన్ అన్నారు. బుడుమూరు గ్రామంలో జరుగుతున్న ఈక్రాప్ నమోదును శుక్రవారం పరిశీలించారు. మండలంలో ఈక్రాప్ నమోదు వివరాలను ఏవో, తహసీల్దార్లను అడిగి తెలుసుకున్నారు. క్షేత్రస్థాయిలోనికి వెళ్లి రైతులు పండించే ప్రతి పంట వివరాలను ఈక్రాప్‌లో నమోదు చేయాలని అధికారులకు సూచించారు. ఈ క్రాప్ నమోదు ఆధారంగానే రైతులకు పంటల బీమా, ఎరువులు, విత్తనాలు అందజేయడం, రైతు భరోసా పథకం వర్తింపు జరుగుతాయన్నారు. రైతులు కూడా దీనిపై పూర్తిస్థాయిలో దృష్టి సారించాలన్నారు. రాగుల సాగుపై రైతులు దృష్టిసారించాలన్నారు. ధాన్యాన్ని ఎలాగైతే రైతుల వద్ద నుంచి ప్రభుత్వం కొనుగోలు చేస్తుందో అలాగే వీటిని కూడా కొనుగోలు చేస్తామన్నారు. జేసీ వెంట తహసీల్దార్ ఎస్.దిలీప్‌చక్రవర్తి, మండల వ్యవసాయాధికారి డి.మహేష్‌నాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు బొడ రవిబాబు, పెదనాయిని సత్యన్నారాయణ, వ్యవసాయశాఖ సిబ్బంది ఉన్నారు.



ఈక్రాప్ వివరాలను అధికారులను అడిగి తెలుసుకుంటున్న జేసీ నవీన్

ప్రకృతి వ్యవసాయ క్షేత్రం పరిశీలన

రణస్థలం: ప్రకృతి వ్యవసాయ పద్ధతులు ఆచరించడం వలన నిరంతరం కూరగాయలు దిగుబడి పొందవచ్చునని ప్రకృతి వ్యవసాయ నార్త్ కోస్టల్ రీజనల్ తేమెటిక్ లీడ్ అధికారి ప్రకాష్ అన్నారు. రణస్థలం పంచాయతీలో పెద్దింటి రాజేశ్వరి 0.15 సెంట్లు పొలంలో ప్రకృతి సిద్ధంగా ఏటీఎం మోడల్‌లో పండించిన కూరగాయల క్షేత్రాన్ని శుక్రవారం పరిశీలించారు. ఏటీఎం మోడల్‌లో ఒక బెడ్ వెడల్పు, నాలుగు అడుగుల మధ్యలో ఒక అడుగు కాలువ ఏర్పాటు చేసుకుని కూరగాయలు పండించే పద్ధతులను వివరించారు. ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ ఎంటీ కృష్ణ, సిబ్బంది గంట్యాడ రాంబాబు, పి.సత్యనారాయణ ఉన్నారు.

బృందావనంలో అష్టమి వేడుకలు

గార: జొన్నలపాడు కాలనీ సమీపంలోని బృందావనంలో బహుళ అష్టమి సందర్భంగా శుక్రవారం శ్రీకృష్ణునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చొదరి దుర్గారావు దంపతులు తొలి పూజలు చేశారు. పెదపాడుకు చెందిన కలగ ఈశ్వరరావు బృందం ఆధ్వర్యంలో భజన కార్యక్రమం నిర్వహించారు. బరాటం సంతోష్, సింహాద్రి శ్రీనివాసరావులు భక్తిగీతాలు ఆలపించారు. చొదరి శ్రీనివాస్, బలివాడ ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల సమస్యల పరిష్కారమే లక్ష్యం

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): మత్స్యకారుల సమస్యలు పరిష్కారమే ధ్యేయంగా పని చేస్తానని బీసీ సంఘం మత్స్యకార జిల్లా ఉపాధ్యక్షుడు మైలపల్లి నర్సింహమూర్తి అన్నారు. ఉపాధ్యక్షునిగా ఎన్నికైన నేపథ్యంలో నర్సింహమూర్తిని శుక్రవారం శ్రీకాకుళం దమ్మలవీధిలో సాయిబాబా ఆలయం వద్ద సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో సువిశాల తీర ప్రాంతమున్నా మత్స్యకారుల స్థితిగతులు మారడం లేదని, ఈ విషయమై ప్రభుత్వం చొరవచూపి అభివృద్ధికి కృషి చేయాలన్నారు. మత్స్యకారులను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు ప్రభుత్వం చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో గనగళ్లమూర్తి, కొర్లయ్య, చీకటి శ్రీనివాసరావు, కొమర మురళి, సూరాడ సత్యం, మైలపల్లి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న మైలపల్లి నర్సింహమూర్తి, సభ్యులు

రోడ్డు పనులకు భూమిపూజ

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ హాలు చుట్టూ సీసీ రోడ్డు నిర్మాణ పనులకు జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, న్యాయశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ ఎన్ని సూర్యారావు ఆధ్వర్యంలో శుక్రవారం భూమిపూజ చేశారు. శ్రీకాకుళం ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు గతంలో రూ. 7.50 లక్షలు మంజూరు చేయగా ఆ మేరకు ఏపీ ప్రభుత్వ ఉన్నత న్యాయస్థానం అనుమతి ఇచ్చిన విషయం విదితమే.జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా ద్వారా ఉన్నత న్యాయస్థానం నుంచి రోడ్డు వేయించేందుకు అనుమతులకు సంబంధించిన ఆదేశాలిచ్చిన నేపథ్యంలో రోడ్డు పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో న్యాయవాదులు సుధాకర్, ఎ.కృష్ణరాజు, రమణమూర్తి, పంచాయతీరాజ్ ఇంజినీర్ మెట్ట పోలినాయుడు, స్పోర్ట్స్ సెక్రటరీ గంగుల భాస్కరరావు, కాంట్రాక్టర్ ధర్మాన గిరిబాబు పాల్గొన్నారు.



కోర్టు ఆవరణలో రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న సూర్యారావు

పారిశ్రామిక అవసరాలు తెలుసుకోవాలి

ఎచ్చెర్ల క్యాంపస్: విద్యార్థులు పారిశ్రామిక అవసరాలు తెలుసుకొని నైపుణ్యాలు సాధిస్తూ ముందుకు సాగాలని బెంగళూరుకు చెందిన మల్టీ హెడ్జ్ కంపెనీ బిజినెస్ ఎగ్జిక్యూటీవ్ చిట్టిబాబు అన్నారు. ఎచ్చెర్లలోని వెంకటేశ్వర ఇంజినీరింగ్ కాలేజీలో ఇండస్ట్రీ రడీనెస్ ప్రొగ్రాన్ని ఇంజినీరింగ్ చివరి ఏడాది విద్యార్థులకు శుక్రవారం నిర్వహించారు. చివరి ఏడాది విద్యార్థులు ఇంటర్న్‌షిప్, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ కార్యక్రమాల్లో పాల్గొని నైపుణ్యం సాధించాలన్నారు. మల్టీహెడ్జ్ హెడ్ ఏఎస్ఆర్ మూర్తి, ప్రిన్సిపాల్ ఎస్.సి.వి.రమణమూర్తి నాయుడు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న వేదపారాయణ

అరసవల్లి: ధర్మప్రచార వారోత్సవాల్లో భాగంగా అరసవల్లి సూర్యనారాయణ స్వామి సన్నిధిలో శుక్రవారం ఉదయం అనివేటి మండపంలో వేదపండితులతో వేదపారాయణ జరిగింది. ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో వేదపండితులు పార్థసారధి, శ్రీనివాసశర్మ (కన్నయ్య), వికాస్ శర్మలు వేదపారాయణ చేశారు. కార్యక్రమంలో ఈవో వి.హరిసూర్యప్రకాష్, భక్తులు పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థతో సుపరిపాలన



గ్రామ సచివాలయ ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

• మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం రూరల్: గ్రామ సచివాలయ వ్యవస్థతో సుపరిపాలన సాగుతోందని, సాహసోపేతమైన నిర్ణయాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థ ద్వారా అమలు చేస్తున్నారని మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. కళ్లేపల్లి సర్పంచ్ గంగు నరేంద్రకుమార్ అధ్యక్షతన పెదగనగళ్లవానిపేటలో రూ.40 లక్షల వ్యయంతో నిర్మించిన సచివాలయ భవనాన్ని మంత్రి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఎటువంటి సమస్యలు ఎదురైనా వెంటనే పరిష్కరించేందుకు సచివాలయ వ్యవస్థ వేదికగా నిలుస్తోందన్నారు. దీంతో పాటు వెల్నెస్ సెంటర్, రైతు భరోసాకేంద్రం ఏర్పాటు చేస్తున్నామన్నారు. అందరికీ సమన్యాయం, సమాన పరిపాలన విధానంతోనే ఈ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. మత్స్యశాఖ మంత్రిగా సీదిరి అప్పలరాజు మత్స్యకారులకు వెన్నుదన్నుగా నిలుస్తున్నారని, మత్స్యకారులను గుర్తించిన పార్టీ ఒక్క వైఎస్సార్ సీపీ మాత్రమేనని స్పష్టం చేశారు. గత టీడీపీ పాలనలో మత్స్యకారులకు ఎవరికైనా మంత్రి పదవి ఇచ్చారా అని ప్రశ్నించారు. పెదగనగళ్లవానిపేట బీచ్‌ను అభివృద్ధి చేశామన్నారు. ఇక్కడి బీచ్ అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తామన్నారు. స్థానిక యువత కోరిక మేరకు ఆట స్థలం కోసం మూడు ఎకరాలు కేటాయించినట్లు మంత్రి ధర్మాన వెల్లడించారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షుడు అంబటి శ్రీనివాసరావు, ఎంపీపీ అంబటి నిర్మల, జెడ్పీటీసీ రుప్పదివ్య, జిల్లా మత్స్యకార సంఘ నాయకులు కోనాడ నర్సింగరావు, గంగు నరేంద్ర, మాజీ సర్పంచ్ చీకటి గురుమూర్తి, సర్పంచ్ రామారావు, సూరాడ సూర్యం, పార్టీ నాయకులు గనగళ్లరాములు, పోలీసు, అమ్మాజీరావు తదితరులు పాల్గొన్నారు.

బాబోయ్ కుక్కలు!



పీఎన్‌కాలనీ రెండో లైన్‌లో గుంపులుగా తిరుగుతున్న కుక్కలు

అరసవల్లి: నగరంలో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. వీధులు, ప్రధాన కూడళ్ల వద్ద ఇష్టారాజ్యంగా తిరుగుతూ వాహనచోదకులను వెంటాడుతున్నాయి. ఏపీహెచ్‌బీ కాలనీతో పాటు స్థానిక నెహ్రూ రోడ్డు, టూటౌన్ పోలీస్ స్టేషన్ వెనుక వీధులు, పీఎన్ కాలనీ రెండో లైన్ తదితర ప్రాంతాల్లో పదుల సంఖ్యలో కుక్కలు గుంపులుగా తిరుగుతున్నాయి. ఉదయానికే దుకాణాల గట్లపై మోహరించడంతో యజమానులు షాపులను తెరవడానికి భయపడుతున్నారు. రోడ్డుపై వెళ్లేవారి పరిస్థితి మరింత ఆందోళనగా మారింది. ఇప్పటికైనా నగరపాలక సంస్థ అధికారులు దృష్టి సారించి కుక్కల నియంత్రణకు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



టూటౌన్ పోలీస్ స్టేషన్ వెనుక నెహ్రూ రోడ్డు వద్ద కుక్కల దండు

సంక్షిప్తంగా..

నేడు నడిమివలసలో వైద్య శిబిరం

జి.సిగడాం: బాతువ ఆరోగ్యకేంద్రం పరిధిలోని నడిమివలస సచివాలయంలో శనివారం ఉదయం తొమ్మిది గంటలకు జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు ఎంపీపీ మీసాల సత్యవతి శుక్రవారం తెలిపారు. స్థానికులు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

రణస్థలం: ఉపాధ్యాయుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.కిషోర్‌కుమార్ కోరారు. ఎంఈవో కార్యాలయం ఆవరణలో ఉపాధ్యాయులు సమస్యలపై శుక్రవారం నిరసన తెలియజేశారు. సీపీఎస్, జీపీఎస్ విధానం రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. యూటీఎఫ్ నాయకులు రవికుమార్, ఎస్.నారాయణరావు, ఎల్.కోదండరామయ్య, టి.శంకరరావు ఉన్నారు.

ఉపాధి పనులు గుర్తింపునకు గ్రామసభలు

లావేరు: పెదలింగాలవలస, తామాడ పంచాయతీల్లో ఉపాధిహామీ పథకం ద్వారా చేపట్టనున్న పనులు గుర్తింపు కోసం శుక్రవారం గ్రామసభలను అధికారులు నిర్వహించారు. కార్యక్రమంలో పెదలింగాలవలస సర్పంచ్ లుకలాపు యశోద, ఏఎంసీ మాజీ డైరెక్టరు అప్పలనాయుడు, తామాడ మాజీ సర్పంచ్ పాలిశెట్టి మధుబాబు, ఉపాధి హామీ పథకం మండల జేఈ లెనిన్‌బాబు, పంచాయతీ కార్యదర్శి ఎం.రమణ పాల్గొన్నారు.

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల, కుప్పిలి, కొంగరాం గ్రామాల్లో ఉపాధి పనుల గుర్తింపు కోసం గ్రామ సభలు నిర్వహించా రు. ఏపీవో శోభాదేవి, మాజీ ఎంపీపీ బల్లాడ జనార్దనరెడ్డి, సర్పంచులు గుండ భాగ్యశ్రీ, బల్లాడ హిందుమతి, జయలక్ష్మి, నాయకులు జరుగుళ్ల శంకరరావు పాల్గొన్నారు.

జల్‌జీవన్ మిషన్ పనులు పరిశీలన

జి.సిగడాం: ఆనందపురం, విజయరాంపురం, పెంట గ్రామాల్లో చేపడుతున్న జల్ జీవన్ మిషన్ పనులను ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ బగాది భాగ్యలక్ష్మి శుక్రవారం పరిశీలించారు. సకాలంలో పనులు పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. సర్పంచులు చిత్తిరి మంజు, వడిశ మహేశ్వరరావు, పున్నాన అక్కలనాయుడు ఉన్నారు.

ప్రాథమిక చికిత్సపై శిక్షణ



శ్రీకాకుళం కల్చరల్: స్థానిక సి.వి.నాగజ్యోతి ఆనంద నిలయంలో రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రాథమి చికిత్సపై శిక్షణ శిబిరం జరిగింది. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు మాట్లాడుతూ ఫస్ట్ ఎయిడ్ నైపుణ్యాలు కలిగి ఉంటే ఆపత్కాలంలో ప్రాణాలు నిలబెట్టవచ్చన్నారు. కార్యక్రమంలో డాక్టర్ జి.ఆర్.శ్రీకాంత్, డాక్టర్ పాత్రుడు, కె.సత్యనారాయణ, బి.సతీష్‌కుమార్, పి.సుజాత తదితరులు పాల్గొన్నారు.

విజయదుర్గకు విశేష పూజలు



శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని నానుబాలవీధిలోని విజయదుర్గా దేవి ఆలయంలో శుక్రవారం పౌర్ణమి సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు.

ఉమాజఠలేశ్వరునికి ప్రత్యేక అలంకరణ

శ్రీకాకుళం కల్చరల్: నక్కవీధిలోని ఉమాజఠలేశ్వర ఆలయంలో స్వామి జన్మనక్షత్రమైన ఆరుద్ర నక్షత్రం సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.